# వాషింగ్ మెషీన్



మాలినికి ఆశ్చర్యం అనిపించింది. రాధ చెప్పిన మాట నమ్మలేకపోయింది. కాని రాధ అబద్ధమాడేలా అనిపించలేదు. మిగతా విషయాలు చెప్తున్నట్లు, మామూలుగానే చెప్పింది.

మలయాళ మూలం : ఇ. హరికుమార్

తెలుగుసేత : ఎల్.ఆర్. స్వామి

"నిజమేనా...?" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా అడిగింది.

"మీ ఇంటిలో కూడా వాషింగ్ మెషీన్ ఉందా?"

"ఉందండి" బట్టలు "వాషింగ్ మెషీన్"లో వేస్తూ అంది రాధ. ఆ పన్నెండేళ్ళ అమ్మాయి వాషింగ్ మెషీన్ అంత కూడా లేదు. ఒక చెక్క ముక్క మెషీన్ ముందు వేసి, దాని మీద ఎక్కి నిలబడి బట్టలు మెషీన్‌లో వేస్తోంది.

ట్యూషన్ టీచర్ వద్ద నుంచి తప్పించుకొని వచ్చింది మాలిని. ఇరువది నుంచి నలుబది వరకు అంకెలు రాయమని పురమాయించి టీ తాగడం మొదలుపెట్టింది టీచర్. ఆమె చూడకుండా మెల్లగా తప్పించుకొని వచ్చింది మాలిని. టీ తీసుకోగానే ఇంటికెళ్ళే తొందరలో వుంటారు టీచర్. అందువల్ల అమ్మ స్నానానికి కేకేసేసంత వరకు మాలిని స్వతంత్రంగా తిరగవచ్చును. అలాంటి సమయంలో రాధతో మాట్లాడుతూ గడుపుతూ వుంటుంది. రాధ గదులు ఊడ్చేటప్పుడు, బట్టలు ఉతికేటప్పుడు ఆమెతో మాట్లాడుతూ వుంటుంది. ఎక్కువగా బడి విషయాలే మాట్లాడుతుంది. లేకపోతే నర్సరీ పాటలు పాడి 'డాన్స్' చేస్తుంది. వొత్తిన 'మార్బుల్' నేల మీద పడిన మాలిని పాదముద్రలు చూసి రాధ హెచ్చరిస్తుంది. నేను వొత్తిన చోట తొక్కేశావు. అమ్మ చూస్తే అంతుంది."

ఆ మాటలు పట్టించుకునేది కాదు మాలిని. ఒక్క చదువు గురించే అమ్మ తిడుతుందని మాలినికి తెలుసు. మాలిని బాగా చదివి డాక్టర్ కావాలనేది తల్లి కోరిక. డాక్టర్ అంటే ఆమెకి పిచ్చి అభిమానం. వ్యాపారం చేసే తన భర్తలా కాకుండా, సమస్యలు లేకుండా, గదిలో కూర్చుని డబ్బులు సంపాదించే డాక్టర్‌ని అసూయతో చూసేది, ఆమె తన భర్త ఒక గొప్ప డాక్టర్‌కన్నా ఎక్కువ సంపాదిస్తున్నా డాక్టర్‌కి లభించే గౌరవం లభించదని ఆమె అభిప్రాయం. తన కూతురుని ఒక 'స్నోబ్' (బడేశిబీ)గా పెంచే ప్రయత్నం చేస్తోంది. తనకన్నా తక్కువ స్థాయిలో వున్న వారిని చిన్నచూపు చూడటం, ఎక్కువ స్థాయిలో వున్న వారిని అభిమానించి అనుకరించడం చేసేది. పేదల్ని పురుగుల్లా చూసేది. అవే కూతురికి కూడా నేర్పుతోంది. అందువల్ల రాధ ముచ్చటపడి మాలినిని ఇంటికి ఒకసారి తీసుకొని వెళ్తానన్నా 'ఒప్పుకునేది కాదు. దరిద్రం ఒక అంటువ్యాధి అని నమ్ముతూ, కూతురిని దానికి దూరంగా వుంచాలని అనుకునేది ఆమె.

NEXT PAGE .......

రాధ 'వాషింగ్ మెషీన్'లో బట్టలు వేస్తూ వుంటే హఠాత్తుగా అంది మాలిని. "మాకు ఈ రోజు కొత్త వాషింగ్ మెషీన్ వస్తుందిగా."

"కొత్తదా..."

"అవును."

"ఇది బాగానే వుందిగా. ఇది కొని ఏడాది కూడా కాలేదుగా."

"ఇది "ఆటోమాటిక్" కాదట. కొత్తది "ఆటోమాటిక్".

అమ్మగారు ఏ ఇంటిలోనైనా "ఆటోమాటిక్" మెషీన్ చూసి వుంటారని, వెంటనే కొనమని అయ్యగారిని సలిపేసి వుంటారని అనుకుంది రాధ.

"చూడండి..." అమ్మగారు గొంతు అనుకరిస్తూ అంది రాధ. "మీరేం చేస్తారో నాకు తెలియదు. వాళ్ళింటిలో వున్నటువంటి మెషీన్ మన ఇంటిలోనూ వుండాలి అంతే."

మెషీన్ కొని వంటగదిలో ప్రతిష్ఠిస్తారు. ఆ తరువాత అంటారు అమ్మగారు. "నీవు ఈ మెషీన్‌ని ముట్టుకోకు. పాతదే వాడుకో." కొత్త మెషీన్ ఇంటికి వచ్చిన వారికి ఒక ప్రదర్శన వస్తువుగా మారుతుంది.



మాలిని మూతి ముడిచి రాధని కోపంగా చూసింది. తన అమ్మని ఎవరైనా కించపరిచి మాట్లాడితే మాలినికి కోపం వస్తుంది!

"నీకు అసూయ" మాలిని అంది. అందుకే ఇలా అంటున్నావు.

"నాకు అసూయ ఎందుకు?" రాధ అడిగింది. "మా ఇంటిలోనూ, ఉందిగా వాషింగ్ మెషీన్."

"అబద్ధం"

"కాదు, నిజం"

"నిజమైతే వీధి కొళాయి వద్ద బట్టలు ఉతుకుతున్నావు ఎందుకు? నేను రెండుసార్లు చూశాను, కారులో వెళ్తూ."

"మా మెషీన్ పాడై పోయింది. బాగు చెయ్యాలి."

"అబద్ధం"

"నిజం. నమ్మితే నమ్ము, నమ్మకపోతే నాకేంటి..."

"మాలిని..." అమ్మ పిలిచింది." రా, స్నానం చెయ్యాలి."

ఆ విషయం ఖచ్చితంగా తెలుసుకోవాలని వుంది మాలినికి. రాధ చెప్తున్నది నిజమేనా? సాధారణంగా రాధ అబద్ధమాడదు.

"మాలినీ..." అమ్మ మళ్ళీ పిలిచింది.

"బేగు వెళ్ళు, అమ్మ పిలుస్తోంది" రాధ అంది.

"నీ ఇంటికి వస్తే వాషింగ్ మెషీన్ చూపిస్తావా!"

అమ్మ వద్దకు నడుస్తూ అడిగింది మాలిని.

"తప్పకుండా. కాని మీ అమ్మగారు నిన్ను మా ఇంటికి పంపరుగా..."

మాలిని ఆలోచించింది. తాను రాధ ఇంటికి వెళ్ళననే ధైర్యంతో అబద్ధమాడుతోందని అనుకుంది. ఎలాగోలా అమ్మని ఒప్పించి రాధ ఇంటికి వెళ్ళాలని నిర్ణయించుకుంది.

స్నానం చేస్తూ, తన ఇంటిలో వాషింగ్ మెషీన్ ఉందని రాధ చెప్పిన విషయం తల్లికి చెప్పింది.

"రాధ ఇంటిలో వాషింగ్ మెషీన్... తినడానికే మెతుకు లేదు..."

"ఉందని చెప్తోంది అమ్మా! ఇంటికెళ్తే చూపిస్తానని చెప్తోంది. ఈ రోజు నేను రాధ ఇంటికి వెళ్తానమ్మా..."

"వద్దు, వద్దు, వెళ్ళొద్దు. రాధ ఇల్లు చెత్తగా అసహ్యంగా వుంటుంది. కంపు కొడుతూ వుంటుంది."

"నేను అక్కడ కూర్చోనమ్మా, ఎక్కడ ముట్టుకోనమ్మా.

వాషింగ్ మెషీన్ చూసి వచ్చేస్తాను అంతే...

"నీకు పిచ్చే. రాధ ఇంటిలో వాషింగ్ మెషీన్ ఏమిటి? రాధ నాన్న పోయి అయిదేళ్ళు గడిచాయి. వాళ్ళమ్మ పని చేసేది మన ఇంటిలో. ఇప్పుడు అమ్మకి బాగోలేదనేగా. రాధ పనిలోకి వస్తోంది! వాళ్ళకి 'వాషింగ్ మెషీన్' కొనడానికి డబ్బులు వుండవు తల్లి."

"అయినా నేను ఒకసారి చూసి వస్తానమ్మా"

"ఒద్దు..."

మాలిని పేచి పెట్టి గోల చేసింది. కూతురు గోల భరించలేక ఇష్టంలేకపోయినా, చివరికి అమ్మ ఒప్పుకుంది.

"మాలినికి మీ ఇంటిలో ఏమి పెట్టక..." రాధని హెచ్చరించింది మాలిని తల్లి.

"అలాగేనండి" రాధ వినయంగా అంది. "అయినా తినడానికి ఏమి వుండదండి మా ఇంటిలో..."

నిజమే! నాలుగు ఇళ్ళలో పని చేస్తున్నందువల్ల ఆకలి ఎరుగక రోజులు గడుపుతోంది రాధ. తల్లి, తమ్ముడు, రాధ ఆ కుటుంబ సభ్యులు. నాన్నపోగానే చదువు మానేసింది రాధ. పనిలోకి వెళ్ళటం ప్రారంభించింది. ముందు తల్లితోనే వెళ్ళేది. పనిచేసే ఇళ్ళలో పెట్టినవి కొంత తిని, మిగిలినవి ఇంటికి తీసుకొని వెళ్తుంది. రాత్రి దానితోనే గడిపేవారు. అయినా రాధ సంతోషంగా ఉండేది. తినడానికి యీ మాత్రమైనా వుంది కదా అని సంతోషించేది.

తాను పని చేసే ఇళ్ళలోని వారి జీవిత రీతులు చూసి రాధ ఆశ్చర్యపోయేది. వాళ్ళ ఇల్లు, బట్టలు చూసి అలాగే నిలబడిపోయేది. తన గుడిసె పక్కనే వున్న గుడిసెలు రైల్వే గేటు రైల్ పట్టాలకు దగ్గరగా వున్న మైదానం - ఇవే అంతవరకు రాధ ప్రపంచం, చుట్టూ నిలిచిన మురికినీటి దుర్గంధం, దోమల సంగీతం, సాయంత్రం వేళలో తాగేసి వచ్చి పెళ్ళాలతో తగువులాడే మగాళ్ళు - దీనికి విరుద్ధమైన మరో లోకముందని, పనిలోకి వెళ్ళటం మొదలైనాకనే తెలుసుకుంది రాధ. మెలమెల్లగా అర్థమైంది రాధకి. డబ్బు ఉన్నవారికి, లేనివారికి మధ్య వున్న తేడా. ఉన్నవారు ఒక ఆదివారం బయటకు వెళ్ళి భోజనం చేసి, ఖర్చు చేసే డబ్బులో సగమైనా పనివాళ్ళకి జీతంగా ఇవ్వటం లేదని గ్రహించింది. పనివారిని కొందరు దోచుకుతింటున్నారని వినాదాలు

NEXT PAGE .....

చేసేవారు కూడా తమ ఇంటి పనివారిని దోచుకుంటున్నారని తెలుసుకుంది. పార్టీలు మారినా, తనలాంటి వారి ఆర్థిక పరిస్థితులు తనలాంటి వాళ్ళు బ్రతికే వాతావరణం మారదని అర్థమైంది రాధకి. రాత్రి పన్నెండు గంటలు దాటితే కాని కొళాయిలో నీరు రాదు. రాత్రి అన్నం తినగానే నీరు కోసం రెండు బిందెలు వరసలో వుంచి, అలసట తీర్చుకోవటం కోసం నడుము వాలుస్తుంది. పగలంతా శ్రమించి అలసిపోయిన ఆమెపై దోమల ప్రభావం ఫలించదు. అయినా పన్నెండు గంటల నుంచి మేల్కొని వుండవలసినదే నీళ్ళ కోసం. నీటి గురించి గొడవ పడని రోజు ఉండదు. మళ్ళీ నాలుగు గంటలకే లేవటం, బట్టలు ఉతకడం కాస్త వండటం – ఆరు గంటలనగానే పనిలోకి వెళ్ళటం. కొళాయి నీళ్ళ కోసం నిలబడినప్పుడు, తను పనిచేసే ఇళ్ళలోని స్నానాల గదులు గుర్తుకు వస్తాయి రాధకి. కొళాయి విప్పగా నే నీళ్ళు – ఎంత కావాలన్నా, ఎప్పుడు కావాలన్నా నీళ్ళు – జీవిత వైరుధ్యాలని చూసి నిట్టూరుస్తూ వుంటుంది రాధ.



"మీ ఇల్లు పెద్దదేనా?" రాధ చెయ్యి పట్టుకొని రోడ్డు వారగా నడుస్తూ మాలిని అడిగింది.

"మరీ పెద్దదేం కాదు" రాధ చెప్పింది. "పెద్ద ఇల్లు ఎందుకు? మేం ముగ్గురే కదా?"

"మేము ముగ్గురేగా" మాలిని అంది. అయినా చాలా పెద్ద ఇల్లు ఉందిగా."

"మీకు పనివారు వున్నారు కదా, గదులు ఊడ్చటానికి, గిన్నెలు తోమటానికి... మాకు పని వాళ్ళని పెట్టుకునేంత డబ్బు లేదుగా..."

మాలిని బుర్ర ఊపింది.

"వాషింగ్ మెషీన్ ఎక్కడ పెట్టారు?" "వర్క్ ఏరియాలోనా"?

వర్క్ ఏరియాలోనా? అంటే... రాధకి అర్థం కాలేదు. ఒక నిమిషం ఆగి అంది. 'చూస్తావుగా...'

రోడ్డు దాటి ఒక సందులోకి తిరిగారు. వాళ్ళ సందు బురదగానూ, గలీజుగానూ ఉంది. బురద తొక్కకుండా వారగా నడిచి ఒక కాల్వారి చేరుకున్నారు.

"ఇంకా దూరమా...?" మాలిని అడిగింది.

"దగ్గరే...'

రైల్వే పట్టాలకు దగ్గరగా కొన్ని గుడిసెలు కనబడ్డాయి. ఒక గుడిసె మరో గుడిసెని తన భుజం మీద వేసుకున్నట్టుంది. కొన్ని గుడిసెలలో గోడలకు బదులు గోనెసంచులు, ప్లాస్టిక్ కాగితాలు వేలాడుతున్నాయి. దారిలో మురికి నీరు – దుర్గంధం. "ఇంటికి వచ్చేశాం" ఒక గుడిసె ముందు ఆగి రాధ ఉత్సాహంతో అంది.

మాలిని ముఖం చిట్లించుకుంది.

ఇదా రాధ ఇల్లు!

గుడిసె లోపలకు అడుగు పెట్టారు ఇద్దరూ. చీకటి మరియు దుర్గంధం వారికి స్వాగతం పలికాయి. '

"ఎవరు వచ్చారు నీతో..." ఒక గొంతు నీరసంగా వినబడింది.

"శారదమ్మ గారి అమ్మాయి... మాలిని..."

"మాలినియా...? ఎంత ఎదిగిపోయావు? రా ఇలారా"

కళ్ళు చీకటితో రాజీపడిన తరువాత ఒక మూలలో నేలమీద ముడుచుకు పడుకున్న ఒకావిడ కనబడింది మాలినికి. కళ్ళు చిట్లించి మళ్ళీ మళ్ళీ చూసింది. నేలమీద పడుకొని వున్న ఆ రూపం ఒక మనిషి అని నమ్మబుద్ధి కాలేదు మాలినికి. చీకటి, దుర్గంధం భరించలేకపోయింది ఆమె. వెంటనే బయటకు వస్తే బాగుంటుందని అనుకుని అడిగింది. "రాధా నీ గదియేది?"

"నాకు గదా?" పకపకా నవ్వింది రాధ. మాలిని దగ్గరికి వచ్చి మోకాళ్ళ మీద నిలబడింది. మాలిని కళ్ళలోనూ, మోములోనూ కనబడిన అమాయకత్వం రాధ హృదయాన్ని కదిలించింది. తాను కూడా ఒక బాలికేనని, ఆప్యాయత, స్నేహం తనకు కూడా అవసరమని ఒక నిమిషం మర్చిపోయింది. ఒక తల్లిలా, మాలినిని ఎత్తుకొని ఆమె బుగ్గలపై ముద్దు పెట్టింది. తల నిమిరింది.

"పాపకి తినడానికి ఏదైనా పెట్టు" రాధ తల్లి అంది.

ఆ మాటలకు రాధ హృదయంలో ఉప్పొంగిన ఆనంద కెరటాలు వెనక్కుసాగాయి. కెరటాలు వెనక్కు వెళ్ళిన హృదయంలో ఇసుక పొరలు మిగిలాయి. మెదడులో వాస్తవాల పురుగులు పాకాయి.

"ఏమీ లేదమ్మా" రాధ అంది. "ఉన్నా ఇవ్వలేం. ఇక్కడ ఏమీ ఇవ్వకూడదని నన్ను, తినకూడదని పాపని ఆజ్ఞాపించి వున్నారు తెలుసా?"

"నీ వాషింగ్ మెషీన్..." మాలిని అడిగింది.

"వాషింగ్ మెషీనా...."

"నీ వాషింగ్ మెషీన్ చూపిస్తానని అన్నావుగా..."

"అదా... చూడు, ఇక్కడే వుందిగా వాషింగ్ మెషీన్... చూడు, ఆ మూల చూడు..."

మాలినికి ఏమి కనబడలేదు, రాధ అమ్మ తప్ప.

"ఆ మూలలోనా... అక్కడ వున్నది మెషీన్ కాదే... మీ అమ్మ కదూ..."

"అవును, అమ్మే, అమ్మే మా వాషింగ్ మెషీన్. రాధ కళ్ళ నుంచి కన్నీరు జాలువారింది." మెషీన్ పాడైపోయింది. ఎన్నో ఏళ్ళు పని చేసింది కదా... ఇప్పుడు...

బయటకు పరుగెత్తింది మాలిని.

"ఆగు..." రాధ పిలిచింది.

మాలిని ఆగలేదు. పరుగెత్తింది. వెనక్కు తిరిగి చూడకుండా పరుగెత్తింది.

"నేను అమ్మ దగ్గరకు వెళ్ళాలి..."

**BACK TO MAIN PAGE ....**